వేదాంతభేరి

ఆగష్టు 2017

రూ. 10/-

వేదాంతభేరి

సంస్థాపకులు : శ్రీశ్రీశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

సంపుటము : 50 ఆగష్టు 2017 సంచిక : 08

సంపాదకులు

శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు

సంపాదక మండలి

శ్రీవిజయానంద బ్రహ్మచారి

కె.ఈశ్వర్

డాక్టర్ సముద్రాల లక్ష్మణయ్య, శిరోమణి, ఎం.ఎ.,

డాక్టర్ కె.సర్వోత్తమరావు, ఎం.ఎ., పి.హెచ్.డి.,

శాశ్వత పోషక చందా రూ. 1500/- అంతకుమించి

సంవత్సర చందా రూ. 100/-లు, విడి సంచిక రూ. 10/-లు

విదేశాలకు సంవత్సర చందా (ఎయిర్ మెయిలు) 20 డాలర్లు

చందా పంపవలసిన అడ్రసు :

శ్రీ శుకబ్రహ్మాశ్రమము,
స్వామి విద్యాప్రకాశానంద నగర్,
శ్రీ శుకబ్రహ్మాశ్రమము (పోస్టు)
శ్రీకాళహస్తి, పిన్ - 517640
ఫోన్ : 08578- 222239

చందాదారులు ఉత్తర ప్రత్యుత్తరాలలో తమ చందా నెంబరు తప్పక వ్రాయవలెను.

Printed & Published by Sri Vidyaswarupanandagiri swami on behalf of Sri Sukabrahma Ashramam and Printed by B.Viswanadham at C.N. Printer, TIRUPATI, Andhra Pradesh; Published at Sri Sukabramhasramam, Swami Vidyaprakashananda Nagar, Sri Sukabramhasramam Post, Srikalahasti-517 640, Chittoor Dist., Andhra Pradesh.
Editor : SRI VIDYASWARUPANANDA GIRI SWAMI

విషయ సూచిక

01. ప్రార్థన - 05
02. జీవుని కర్తవ్యము - శ్రీ విద్యాప్రకాశానందగిరిస్వాములవారు - 06
03. జీవకారుణ్యము - శ్రీ సద్గురు మలయాళస్వాములవారు - 09
04. శ్రీసాయం వరదదాసకవి - డా॥సముద్రాల లక్ష్మణయ్య - 13
05. జ్ఞానసుధ - సర్వభూషణ శ్రీ శివయోగిగారు - 17
06. కథాత్మక గీతా సూక్తులు - ఆచార్య కె.సర్వోత్తమరావు - 20
07. పుష్పదంత విరచిత శివమహిమ్న స్తోత్రమ్ - శ్రీమధుసూదనీవ్యాఖ్య - 23
08. అష్టాశయముల నాశ్రయింపుము- శ్రీ స్వామి సర్వేశ్వరానందగిరి - 28
09. శ్రీ మదాంధ్ర మహాభాగవతము -ఆచార్య జక్కంపూడి మునిరత్నం- 33
10. హిందూ దేవాలయాల పుట్టుపూర్వోత్తరాలు - ఆచార్య ఎస్.శ్రీపతినాయుడు - 37
11. వార్తలు - 42

ముఖచిత్రం :

ప్రణవ స్వరూప రాధాకృష్ణుడు

తేది : 14-08-2017 శ్రీకృష్ణ జన్మాష్టమి

15-08-2017 శ్రీ అరవిందయోగి జయన్తి

25-08-2017 వినాయక చవితి

ఇందులోని వ్యాసముల భావములకు వ్యాస రచయితలే బాధ్యులు

ప్రార్థన

- శ్రీ వల్లభాచార్యులు

1. అధరం మధురం వదనం మధురం
నయనం మధురం హసితం మధురమ్ ।
హృదయం మధురం గమనం మధురం
మధురాధిపతే రఖిలం మధురమ్ ॥

2. వచనం మధురం చరితం మధురం
వసనం మధురం వలితం మధురమ్ ।
చలనం మధురం భ్రమితం మధురం ।
మధురాధిపతే రఖిలం మధురమ్ ॥

3. వేణుర్మధురో రేణుర్మధురః
పాణిర్మధురః పాదౌ మధురౌ ।
నృత్యం మధురం సఖ్యం మధురం
మధురాధిపతే రఖిలం మధురమ్ ॥

4. గీతం మధురం పీతం మధురం
భుక్తం మధురం సుప్తం మధురమ్ ।
రూపం మధురం తిలకం మధురం
మధురాధిపతే రఖిలం మధురమ్ ॥

5. కరణం మధురం తరణం మధురం
హరణం మధురం రమణం మధురమ్ ।
వమితం మధురం శమితం మధురం
మధురాధిపతే రఖిలం మధురమ్ ॥

6. గుంజా మధురా మాలా మధురా
యమునా మధురా వీచీ మధురా ।
సలిలం మధురం కమలం మధురం
మధురాధిపతే రఖిలం మధురమ్ ॥

7. గోపీ మధురం లీలామధురా
యుక్తం మధురం ముక్తం మధురమ్ ।
దృష్టం మధురం శిష్టం మధురం
మధురాధిపతే రఖిలం మధురమ్ ॥

8. గోపా మధురా గావో మధురా
యష్టిర్మధురా సృష్టిర్మధురా ।
దలితం మధురం ఫలితం మధురం
మధురాధిపతే రఖిలం మధురమ్



జీవుని కర్తవ్యము

- శ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారు

జన్మించిన ప్రతి ప్రాణియు మూడింటిచేత బంధింపబడుచున్నది. దేశము, కాలము, క్రియ అనునవియే అవి. వానినే ఇంగ్లీషులో Space, time and Causation అని అందురు. దేశముచేత బంధింపబడుట యనగా ఒక ఆకారము కలిగియుండుట, దేహమను ఆకృతిని ధరించుట. ఆ దేహము పరిమితముగా నుండును. ఆ పరిమితిని మించి అతడు పెరగలేడు. ఎవడైనా 20 అడుగుల ఎత్తు పెరగగలడా ? నాలుగు చేతులు, రెండు తలలు తెచ్చుకొనగలడా ? భగవంతుడిచ్చిన దానితో పరితృప్తిని బొందవలసినదే. కాబట్టి అతడు దేశము(ఆకారము)చే బద్ధుడైయున్నాడు.

అట్లే కాలము. ప్రతిజీవికి పుట్టినప్పుడే కొంత ఆయుర్దాయము నిర్దేశింపబడియుండును. 60 సంవత్సరములో, 70 సంవత్సరములో, లేక 80 సంవత్సరములో పరిమితి వయస్సునకు ఉండును. ఆ కాలము పూర్తికాగానే ఒక్క క్షణము కూడ అధికముగ ఉండజాలడు. దేహము పతనమైపోవును. కాబట్టి జీవుడు కాలముచే బంధింపబడుచున్నాడు.

ఇక క్రియ అనగా కర్మము. జీవుడు తాను పూర్వము చేసిన కర్మమునకు బద్ధుడగుచున్నాడు. ఇదివఱకు పుణ్యకార్యము లాచరించినచో తత్ఫలితముగ ఇపుడు సుఖపడుచున్నాడు. కాబట్టి జీవుడు తన కర్మకుతాను బద్ధుడై యున్నాడు. ఈ ప్రకారముగ దేశకాల క్రియలచే బంధింపబడి, త్రాడుచే బంధింపబడిన పశువువలెను, కారాగార మందుంచబడిన చోరునివలెను, జీవుడు నానా యాతనలను అనుభవించుచున్నాడు.

పుణ్యము ఫలించినవానికే తాను బంధనమందున్నాడని తెలియును. అట్టివాడే ముక్తికొఱకై ప్రయత్నించును. "నాకు బంధనమే లేదు.' అనుకొనువాడు విముక్తికొఱకై ఏల ప్రయత్నించును ? దేహము ధరించుటయే బంధనము. కాలమునకు వశుడగుటయే బంధనము. కర్మకు లోబడుటయే బంధనము. ఆత్మజ్ఞానము బడసినవాడే ఈ మూడింటి నుండి తప్పించుకొనును. తాను జడమైన దేహము కాదు. చిన్మయ ఆత్మస్వరూపమే తాను అనుకొనువానికి ఇక దేహజనిత బంధనములతో ఏమి సంబంధము? కాబట్టి జన్మించిన ప్రతివాడును. ఎంత శీఘ్రముగ ఆత్మజ్ఞానమును పొందగల్గునో అంత ధన్యతను జెందుచుండును. అట్టి ఆత్మజ్ఞానమును శీఘ్రముగ బొందుటకు శ్రీ శంకరాచార్యులవారు చక్కని ఉపాయమును సెలవిచ్చిరి.

ఒక వృద్ధుడు కాటికి కాళ్ళు జాపుకొని యుండి తృటిలో మోక్షము బడయుటకై ఉపాయమును అర్థింప శ్రీ శంకరాచార్యుల వారు అతనితో నిట్లు పలికిరి.

కిం జ్యోతిస్తవ భానుమానహని మే రాత్రౌప్రదీపాదికం
స్యాదేవం రవిదీపదర్శనవిధౌ కింజ్యోతిరాఖ్యాహి మే
చక్షుస్తస్యనిమీలనాది సమయే కిం ధీ ర్ధియోదర్శనే
కిం తత్రాహమతో భవాన్పరమకం జ్యోతి స్తదస్మిప్రభో.

శంకరులు : నాయనా ! ఈ పదార్థములన్నిటిని దేనిచే చూడగల్గుచున్నావు?
వృద్ధుడు : పగలు సూర్యుని ప్రకాశము చేతను, రాత్రి చంద్ర దీప ప్రకాశములచేతను.
శం : ఆ సూర్యుని, దీపాదులను దేనిచే చూడగల్గుచున్నావు ?
వృ : కంటిచే
శం : కన్ను మూసికొన్నపుడు దేనిచే తెలిసికొనుచున్నావు ?
వృ : బుద్ధిచే

శం : బుద్ధిని దేనిచే తెలిసికొన గల్గుచున్నావు ?
వృ : ఆత్మచే
శం : కాబట్టి ఆ ఆత్మయే అన్నిటిని ప్రకాశింప జేయుచున్నది. ఆదియే నీవు. అదియే నీ స్వరూపము – నీ స్వరూపము ఆత్మయని యెఱుంగుటయే మోక్షము. అదియే బంధవిముక్తి.

ఈ ప్రకారముగ శ్రీ శంకరాచార్యులవారు ఆ వృద్ధునికి తృటిలో మోక్షమును బొందు ఉపాయమును తెలియజేసెను. ప్రతివాని హృదయమందు నాశరహితమైన పరమాత్మ వెలుగుచున్నను, అజ్ఞాని తెలిసికొనజాలక తాను దేహమని భావించి జడమైన ఆ దేహముతో తాదాత్మ్యమును బొంది నానాక్లేశములను బొందుచున్నాడు. కాబట్టి ఆత్మయే తానని దృఢముగ భావించుటే మోక్షము.

కో దేవో యో మనస్సాక్షీ
మనో మే దృశ్యతే మయా
తర్హిదేవస్త్వమేవాసి
ఏకో దేవ ఇతి శ్రుతేః.

శిష్యుడు : దేవుడెవరు ?
గురువు : మనస్సునకు సాక్షియైనవాడు
శిష్యుడు : మనస్సునకు సాక్షి నేనే కదా ! నేనే మనస్సును చూచుచున్నాను కదా !
గురువు : కాబట్టి నీవే (ఆత్మయే) దేవుడవు.దేవుడు ఒక్కడేయని శ్రుతులు ఉద్ఘోషించుచున్నవి.

ఈ ప్రకారముగ ఆత్మవిచారణచే దృక్స్వరూపమగు ఆత్మను చక్కగా తెలిసికొని అట్టి స్వస్వరూపమందు నిలకడ కలవాడై దృశ్యభావన లేకుండవలెను. దృశ్యము భారము వంటిది. భారవిముక్తుడగుటయే జీవుని కర్తవ్యము.

జీవకారుణ్యము

– శ్రీ సద్గురు మలయాళస్వాములవారు

"కారుణ్యం పరమం తపః" అనగా సమస్త జీవరాసులయందు కారుణ్య ముండుటయే పరమతపస్సనబడును. అనగా, ఆత్మస్వరూపదర్శన మదియేయని మహాత్ములుద్ఘోషించుచున్నారు. మనము కొంచెము సూక్ష్మ దృష్టిని నిమీలనముజేసి చూచినచో, మానవజన్మమునకన్న నెంతో క్రింది జన్మములో నుండెడి గోవు, ఏనుగు, గుఱ్ఱము, జింక మొదలైన పశువులు గూడ పావనమగు తృణధాన్యాదులనే దినుచుండును. కనుకనే యవి మృగములైనను మానవులచే దేవతలవలె పూజార్హములైనవి. మఱియు ఆ జంతువుల యొక్క శాంతము, పావనత్వము నేమని చెప్పవచ్చును !

దుష్టమృగములని పేరు జెందియుండు పులి, తోడేలు మొదలగు జంతువులు క్రూరస్వభావము గలవగుటచే మానవులకు దూరస్థములైనవి. ఇట్లుండగా నుత్కృష్టులైన మనుష్యులలో ఆర్యులని ప్రఖ్యాతి గాంచిన మర్త్యులు దయాశూన్యులై పులుల బోలె ప్రాణిహింస జేసి జీవించు టెంతాశ్చర్యకరము ! మఱియు మనుజులలో పావనమైన వేదాంత విచారపరులై, పుణ్యస్వరూపులైన సాధువుల రూపము ధరించుయుండు పెద్దలలో గొందరు జీవహింసాతత్పరులైయుండు టెంతవిచారకరము ? అకటా ! లోకములో గల యధర్మమును దొలగించి ధర్మమును బోధించుటకొరకుండెడి రాజయోగములలో గొందరి మనసు ఈశ్వరా ! ఇంత కఠినమగుటకు ఉక్కుతో జేయబడినది ?

I
II
III
IV

శివ ! శివా ! కించిత్తైనను కనికరములేని యీ నిర్దయ హృదయులకు జ్ఞానము గలదనుమాట నమ్ముటకంటె నమావాస్య అర్ధరాత్రిని పౌర్ణమి, మధ్యాహ్నమని చెప్పినను నమ్మవచ్చును. పై జెప్పిన దానిని నమ్మరాదు. ఒక్కరి యుదరములోపల మాంసము ప్రవేశించు నప్పుడు వారియందేదైన దయా, శాంత, శమ, దమాది సుగుణములుండిన అవియప్పుడే దూరముగా బారిపోవును. ఎట్లన ? ఆవులదొడ్డిలో పులి ప్రవేశించిన అచ్చట గోవులు నిలుచునా ? ఇదియునుగాక చవిటి భూమిలో జల్లిన విత్తనము లెట్లు వ్యర్థములో అట్లే దయాశూన్యుల తపోధ్యాన జపపూజాదులన్నియు నిష్ప్రయోజనములు. అదేరీతిగా శ్రవణ మనన నిదిధ్యాసనాదులు గూడ నిరుపయోగములు. మఱియు జంతువులను వధించునప్పుడు వాటి ప్రాణసంకటకరమైన పరితాపావస్థను జూచిన ఎవరి హృదయము నీరుగా గరుగకుండును !

సర్వేశ్వరా ! ఇట్లుండియు శుష్కవేదాంతులు ప్రాణివధలలో రాక్షసులవలె నిర్దయులై యుండుట హా ! యెంత కష్టము ! దీనికి కారణము గలదు. ఒక్కడు జన్మనా అంధుడుగాను, బధిరుడుగా నుండినచో, దుఃఖముతో బరితపించు వాడొక్కడు పోయి నానా ప్రకారముల దనకుండు పరమసంకటము జెప్పుకొని యేడ్చినను, బహుఖేదముతో బరితపించి, కరచరణాదులతో తన్నుకలాడినను ఈ దుఃఖ చిహ్నముల వినిగాని చూచిగాని యా బధిరాంధునికి కొంచెమైనను దయ గలుగునా ? లేదు గదా ! కారణమేమన, గ్రుడ్డివాడౌటచే జూచుట లేదు. చెవిటివాడైనందున వినుట లేదు. అదే విధముగా నెవరికి ప్రాణులయొక్క సంకటము గోచరపడలేదో, వారికింకను నిజమగు మానవత్వము గలుగలేదని బాగుగ దెలిసికొనుడు. ఇట్లుండగా వీరికి దైవాంశులచే బొందదగు రాజయోగత్వ మెట్లు సిద్ధించును ? "మనుష్యరూపేణ మృగాశ్చరంతి" అనగా వారిని

గోచర్మధారియగు వ్యాఘ్రమని తెలిసికొనుడు. అనగా వీరు పరమపావనులైన సాధువుల వేషమును, నిర్దయులైన రాక్షసుల కృత్యమగు ఆహారమును గలిగియుందురు. మఱియు నిర్మల దర్పణమందు పురోభాగవస్తువులు స్పష్టముగా ప్రతిఫలించునేగాని మలినదర్పణమున ప్రతిబింబించునా ! ఆలాగున పరిశుద్ధ హృదయము లేనివారికి ఇతర ప్రాణుల సంకటము హృదయములో స్ఫురింపదు.

హృదయము పావన మగునప్పుడొక్క ప్రాణికైనను పీడగలిగిన జూచిన సహింపదరము గాదు. మఱియు నితర ప్రాణులనుగాని, మనుజులనుగాని, సంకటపెట్టి తనయొక్క సుఖము బూరించునప్పుడు నిశ్చయముగా నతడు మృగమనుష్యుడే ! తనయొక్క సుఖమును విడువకయు, అన్యప్రాణులయొక్క సౌఖ్యమునకు హానిగలుగజేయకయు, ధర్మమార్గమున జీవించునప్పుడు నిజమైన మానవజన్మములో ప్రవేశించిన వాడగును. మఱల నింద్రియాది సమస్త సుఖములను రోసి సకల జీవుల సుఖమే తనయొక్క సుఖమను బుద్ధిగలిగి బ్రహ్మధ్యానానందామృతములో నోలలాడి తేజరిల్లునప్పుడు మానవదేవుడగుచున్నాడు. ఈ స్థితియే నిజమైన సాధువులయొక్క యవస్థయని తెలిసికొనుడు. ఈ స్థితిలో వారు ముక్తులగుచున్నారు. ఈ పదవితో నుపమించు నప్పుడు మన శుష్కవేదాంతులే స్థితియందున్నవారో పాఠకులే గ్రహించగలరు.

ఓహో ! లోకము పాపాగ్నిచే దహింపబడుచుండగా నాయగ్నికి వాయుదేవుడు సహాయపడినట్లు మనరాజయోగులలో గొందఱు పాపకరమైన ప్రాణిహింస, సురాపానాదులు దోషకరము గావనియు మనుజులకొఱకే యవి సర్వేశ్వరునిచే సృష్టింపబడెననియు జెప్పునదెంత వివేకశూన్యమైన మూర్ఖత్వము ! హా ! వీరికి ఈశ్వరకరుణ యెట్లు

గలుగును ? ఈశ్వర కారుణ్యామృతవృష్టిలేనిచో తాపత్రాయాగ్ని యెట్లు శమించును ? ముష్టి విత్తనమును నాటిన కమలాఫలములు బండునా? పూర్వీకులగు సాధువులు దమయొక్క యావజ్జీవతమును లోకసేవలో వినియోగపరచి ధన్యులైరి. ఇప్పుడున్నవారలు శిష్యులయొక్క ధనమును దోచుకొని జిహ్వేంద్రియ చాపల్యము నిలుపజాలక ఇంద్రియ సౌఖ్యములే పరమపురుషార్థమని నమ్మి బద్ధులగుచున్నారు. ఈ యధర్మమునకు బూనినప్పటి నుండియే లోకము దుఃఖమునకు బాలైనది. వీరికమీద దమయొక్క యాత్మగౌరవము నిలుపుకొనుటకును, శిష్యులకు గల భక్తి విశ్వాసములు చెడకుండుటకును, పెద్ద మనుష్యులకు వీరియందుగల నమ్మకమును నెలకొల్పుటకును, అధ్యాత్మజ్ఞానమునకు గళంకము గలుగకుండుటకును విచారముండినచో, ఇప్పుడైనను సదాచార సన్మార్గములలో నడుగుపెట్టుట మంచిది. లేనిచో నికమీద సంసారమందుండెడి స్త్రీ బాలురకుగూడ వీరు జవాబు చెప్పజాలరని నేను దృఢముగా నమ్ముచున్నాను. ఏలన ! ధర్మబోధమను సూర్యోదయమైనది. దానియొక్క చిహ్నమే శిరశ్చేదమున కధికారము బొందియుండు నధికారుల సమీపించి బాలురును, స్త్రీలును, స్వరాజ్యము కొఱకు ధర్మధ్వజములను జేతులచే బైకెత్తుకొని యుచ్చస్వరముతో నిర్భయముగా ధర్మమును జాటించుచున్నారు. కనుక నొకవేళ చిరకాలము నుండి యలవాటుపడిన దుర్భ్యాసములను ఇప్పుడు నిలుపుటకు తగు వైరాగ్యము లేనిచో, మేము చాలాకాలమునుండి భుజించుచు వచ్చినందున ఇప్పుడు విడుచుటకు సాధ్యము గాదని చెప్పుట మేలు. లేనిచో నికమీద వారి యవస్థ సంకటకరమని జెప్పుచున్నాను. వీరి బెదిరింపులకు భయపడువారు లేరని లోక పరిస్థితిని జూచి గ్రహించుట మంచిది.

శ్రీ సాయం వరద దాసకవి

– డా ॥ సముద్రాల లక్ష్మణయ్య,
(తిరుపతి)

కవులు మహనీయుల చరిత్రలను కీర్తిస్తారు. అలా కీర్తింపబడిన శరీరధారులైన మహాత్ములు సైతం కాలం తీరగానే కనుమరుగై పోతారు. కాని వారిని కీర్తిస్తూ కవులు రచించిన రచనలు మాత్రం శాశ్వతంగా ఉండిపోతాయి.

శ్రీరాముడు, శ్రీకృష్ణుడు మున్నగు మహాపురుషులు ఇప్పుడు లేరు. కాని వారి వైభవాన్ని ప్రశంసించి వారి దివ్యమైన వ్యక్తిత్వాన్ని సాక్షాత్కరింపజేసే రామాయణం, భాగవతం ఇత్యాది గ్రంథాలు మాత్రం స్థిరంగా ఉన్నాయి. ఆయా గ్రంథాల రచయితలు లేకుంటే, శ్రీరాముడు మున్నగు వారి మహత్త్వం మనకు తెలిసివుండేది కాదు. అందుచేత వాల్మీకి, వ్యాసుడు, కాళిదాసు మున్నగు కవులు సదా స్మర్మణీయులై వున్నారు.

ఆదిరాజయశోబింబమాదర్శం ప్రాప్య వాఙ్మయమ్ ।
తేషా మసన్నిధానే2పి న స్వయం పశ్యనశ్యతి ॥

అని ఆలంకారికులన్నారు. అనగా ప్రాచీనులైన మహారాజుల కీర్తిబింబం వాఙ్మయమనే అద్దంలో ప్రవేశించి, ఆ రాజులు లేకున్నా తాను మాత్రం నశించకుండా వుంటుంది అని భావం. మనిషి గతించినా, అతని చిత్రం అతడు తీయించుకొన్న ఫోటో ఉండడాన్ని మనం చూస్తూనే ఉన్నాం కదా !

మహాత్ములను కీర్తించే కవులు వారికి సమకాలికులూ కావచ్చు, లేదా తదనంతర కాలానికి చెందిన వారూ కావచ్చు. వాల్మీకి శ్రీరామునికి సమకాలికుడంటారు. కాళిదాసాది కవులు తమ సమకాలిక ప్రభువులను కాక ఎన్నడో గతించిన రఘువంశ రాజులను వర్ణించారు.

వేదాన్తభేరి ... చం
మురళీధర కృష్ణుడు
ollow the master

ఈ విషయాన్ని ఇక్కడ ఎందుకు ప్రస్తావించానంటే సద్గురువుగా చరాచర సుఖాభిలాషిగా, శుష్క వేదాంత తమోభాస్కరులుగా, వ్యాసాశ్రమ నిర్మాతగా, ఆంధ్ర ఆధ్యాత్మిక పితామహులుగా ప్రసిద్ధి జెందిన మహర్షి సద్గురు శ్రీ మలయాళస్వాములవారి విశిష్ట వ్యక్తిత్వాన్నీ, మహానుభావత్వాన్నీ అనేక కవులు కీర్తిస్తూ వివిధ రచనలు చేశారు. వారిలో శ్రీ సద్గురు దేవులకు సమకాలికులూ వున్నారు. తదనంతర కాలానికి చెందిన వారూ ఉన్నారు.

శ్రీ వారికి సమకాలికులైన అట్టి కవులలో శ్రీ సాయం వరద దాసకవి అగ్రగణ్యులు. వారు రచించిన 14 పుస్తకాలు లభించాయి. ఆ పుస్తకాలలో 'భజగోవిందం', 'నమశ్శివాయ గేయామృతం' మున్నగు రచనలు వ్యాసాశ్రమ సంప్రదాయ శిష్యులకందరికీ సుపరిచితాలే. బాల్యంలో ఆశ్రమంలో విద్యాభ్యాసం చేస్తూ, నేనూ, నాతోపాటు వందలాది విద్యార్థులమూ పై గ్రంథాలను నిత్యమూ పఠించే వాళ్ళం.

శ్రీ వరదదాసు సహజకవి, గొప్ప వక్త,పైగా మంచి హరికథకుడు. గోగర్భంలో శ్రీవారు తపోనిష్ఠలో ఉన్నప్పుడే వారి పట్ల భక్తి ప్రపత్తులు గల్గి శిష్యత్వం వహించాడు. శ్రీవారి పట్లా, వారి ధర్మప్రచారం పట్లా శ్రీ వరద దాసు అనన్య సామాన్యమైన భక్తి కల్గి వుండేవాడు. ఆ భక్తియే ఆయనను కవిశ్రేష్ఠునిగా రూపొందించిందని నిస్సందేహంగా చెప్పవచ్చు.

శ్రీ వరదదాసుగారి రచనలలో " శ్రీమలయాళ సద్గురు స్మరణామృతం" అన్న గ్రంథం మిక్కిలి విశిష్టమైనది. శ్రీవారి విశిష్టతనూ, తపోనిష్ఠనూ, లోకోద్ధారకత్వాన్నీ, సంఘసంస్కరణ దీక్షనూ ఈ రచనలో కవిగారు లోకోత్తరంగా వర్ణించారు. ఇంచుమించు 50 పుటలకు పరిమితమైన ఈ గ్రంథంలో సీసపద్యాలూ, పాటలూ ఉన్నాయి.

సీసపద్యాలన్నీ –

' కలుషదూర ! వ్యాసాశ్రమ స్థల విహార '!
పరమ కారుణ్య ! మలయాళ గురువరేణ్య "

అన్న మకుటంతో సమాప్తమవుతాయి. పాటలు సంప్రదాయ పద్ధతిలోనూ, సంకీర్తనా సరళిలోనూ రచించబడినాయి.

ఈ గ్రంథంతోపాటు మిక్కిలిగా వ్యాప్తి పొందిన మరొక లఘు గ్రంథం "అహింసా పుష్పం". ఇందులో జంతుబలిని కవిగారు నిశితంగా నిరసించారు. అహింసా గుణ విశిష్టతను కొనియాడారు. శ్రీ సద్గురు స్వాములవారు జంతువులపట్ల చూపిన కరుణా గుణాన్ని ప్రశంసించారు. ఈ గ్రంథం చదివిన పెక్కుమంది మాంసాహారులు శాకాహారులుగా మారుటను నేనెరుగుదును. అహింసాది గుణాలనూ, భక్తియోగ ప్రాముఖ్యాన్నీ, శ్రీ మలయాళ సద్గురుస్వాములవారి జీవితంతో సమన్వయిస్తూ శ్రీ వరదదాసుగారు రచించిన రచనలు ఆంధ్రావనిలో విస్తృత వ్యాప్తి పొందాయి.

శ్రీ వరదదాసు గారి తరువాత శ్రీనాగనార్యులవంటి గొప్ప కవులు శ్రీవారి చరిత్రను రచించారు. ముక్తక రచనలు కావించారు. కాని వరదదాసుగారి రచనలు ఇతర రచనల కంటే మేటియైనవనీ, లోకోత్తరమైనవనీ చెప్పవచ్చు.

ఉదాహరణకు ఈ క్రింది రెండు పద్యాలు గమనించండి.

హీనశూద్రులకేల జ్ఞాన విద్యలటంచు
అగ్రజాతులు గర్వమందు వేళ
అబలలకేల బ్రహ్మజ్ఞాన మంచును
పురుషులు లోభులై పోరువేళ
దిక్కింత లేనట్టి దీనజీవుల బట్టి
కర కర కంఠముల్ దరుగు వేళ
బ్రహ్మవిద్య అగాధపతితమై పోవంగ
జేయు దుష్టాత్ములు చెలగువేళ
రహి వెలుంగ తమో భాస్కరంబనంగా
మించు విజ్ఞానధక్క మ్రోగించినావు ॥ కలు ॥

నీ గ్రంథముల గన్న – నిఖిలాగ్రజాతుల
జాత్యాధిపత్యంబు సమసిపోయె
నీ ధర్మములగాంచు నిఖిల మానవులకు
నబలలపై దయ ప్రబలమయ్యె
నీ వాక్యముల విన్న జీవహంతకులకు
కరుణాంతరంగంబు గడలు కొనియె
నీ దర్శనం బైన వేదనిందు[illegible]
శుష్క వేదాంతంబు శూన్యమయ్యె
భళిరె ! మా ఆంధ్రదేశ సౌభాగ్యమేమో
నిన్ను గని పావనం బౌచు – వన్నె మీరె ॥ కలు ॥

ఎవడు బ్రాహ్మణుడు ?

మూలం
బుద్ధుని ధర్మపదం

అనువాదం
– బ్రహ్మచారి ఆనందమోహన్

(శ్రీ మలయాళ సద్గురు స్మరణామృతం)

శ్రీ వరదదాసులవారి రచనలే నాకు బాల్యంలో కవిత్వంపై అభిరుచి కల్గించాయి. కవిగారు 1937లో పరమ పదించారు.

1962లో నేను ' శ్రీమలయాళ సద్గురు శతకం' రచించాను. అప్పటికి శ్రీవారున్నారు. గురుపూజా సందర్భంలో శ్రీవారి సమక్షంలో ఈ క్రింది పద్యం చదివాను.

తన కవితామహత్త్వమున తావక సద్గుణ జాలమున్ మహా
జనులె దా మెచ్చునట్టుల ప్రశస్తతరంబుగ జెప్పి ముక్తుడై
తనరె భవత్కృపన్ వరదదాసకవీశ్వరుడంత గొప్పగా
నిను వినుతింప నే జడుడ నేర్తునె ! శ్రీ మలయాళసద్గురూ !
(105).

ఇది చదివినప్పుడు శ్రీ స్వాములవారు ' ఓహోహో !' అంటూ నన్ను అభినందించి ఆశీర్వదించారు. 2005లొ శ్రీ విద్యానంద స్వాములవారి అనుమతితో శ్రీ వరదదాసుగారి 14 రచనలను ' శ్రీసాయంవరదదాస గ్రంథావళి" అన్న పేరుతో 400 పుటల గ్రంథంగా పరిష్కరించి ప్రచురింపజేసే అదృష్టం నాకు కల్గింది.

జ్ఞాన సుధ

మూలం
శ్రీ సర్వభూషణ శివయోగి వారు

అనువాదం :
పూజ్యశ్రీ శంకరానందగిరి స్వాములవారు
ఉమామహేశ్వర పీఠాధిపతులు

(గత సంచిక తరువాయి)

" నిత్య కార్మనుష్ఠానా ద్ధర్మోత్పత్తిః, ధర్మోత్పత్తేః పాపహాని, స్తతశ్చిత్తశుద్ధిః, తతస్సంసారయాథాత్మ్యావబోధః, తతో వైరాగ్యం, తతో ముముక్షుత్వం, తత స్తదుపాయ పర్యేషణం, తత స్సర్వకర్మ తత్సాధనసంన్యాసః, తతో యోగాభ్యాసః, తత శ్చిత్తస్య ప్రత్యక్ప్రవణతా, తత స్తత్వమస్యాది వాక్యార్థ పరిజ్ఞానం, తతో2విద్యోచ్ఛేదః, తతః స్వాత్మన్యేవావస్థానమ్." అనగా నిత్యకర్మలను అనుష్ఠించుటవలన పుణ్యము గలుగును. పుణ్యముచేత పాపము నశించును. పాప క్షయమువలన చిత్తము శుద్ధమగును. చిత్తశుద్ధిచేత సంసారముయొక్క యథార్థస్థితి గోచరించును. దానిచేత వైరాగ్యము, వైరాగ్యమువలన ముముక్షుత్వము (మోక్షాభిలాష), ముముక్షుత్వముచేత మోక్ష - ఉపాయమును వెదకుట, దానిచే సర్వ కర్మలను, కర్మసాధనములను సంన్యసించుట, దానిచేత యోగాభ్యాసము, యోగముచేత మనస్సు అంతర్ముఖమగుట, తరువాత అవిద్య (అజ్ఞానము) నశించుట, తరువాత స్వరూపమునందే నిలుకడ నొందుట, దానిచే మోక్షలాభము కలుగునని వార్తికకారుల '(శ్రీసురేశ్వరాచార్యుల) వాక్యము.

అవ : జ్ఞానకర్మ సముచ్చయము నంగీకరింపనిచో కేవలము కర్మచేత ముక్తినందవచ్చునను పూర్వ పక్షమును నిరాకరించుచున్నారు.

నానాత్వాన్నహి కర్మణే2మృతపదం తైశ్చే త్సమస్తైర్నతా
న్యేకస్మిన్ యది తేన తేన సకలాముక్తాశ్చితి స్యాద్ వృథా,
నిష్కామ్యం జనుషే న తద్యది కథం నిష్కామ్యమంహోభవే
దేవంచే త్తదతిక్రమో2స్త్వఘ మతస్త్యాగో మతః కర్మణః 45

నానాత్వాత్ - వేఱు వేఱుగా (అనేక విధములై) ఉండుటవలన కర్మణః =కర్మవలన, అమృతపదం = ముక్తి, న=లేదు, హి= నిశ్చయము,తైః = ఆ, సమస్తైః = అన్ని కర్మలచేత , చేత్ = (ముక్తి) అనినచో, తాని= ఆ సమస్త కర్మలు, ఏకస్మిన్= ఒక్కనియందు, న= సంభవింపవు, యది= ఒకవేళ, తేన తేన = ఆయా ప్రతియొక్క కర్మచేత (ముక్తి అనినచో అపుడు) సకలాః = అందఱు, ముక్తాః = ముక్తిగలవారు (అగుదురు) (అపుడు) చితిః = జ్ఞానము, వృథా స్యాత్ = నిరర్థకమగును. యది = ఒకవేళ, నిష్కామ్యం = నిష్కామకర్మ, జనుషే = జన్మ కొఱకు, న = కాదు (ముక్తికొఱకే అనినచో) ఏవం= ఈ నిష్కామ పుణ్యకర్మవలె, అంహః= పాపము, పాపకర్మ, నిష్కామ్యం = నిష్కామము, నిష్కామ కర్మ, కథం భవేత్ = ఎట్లగును ? తత్ అఘం అస్తు ఇతి చేత్ = ఈ పాపకర్మ ఉండుగాక అనినచో, తత్ అతిక్రమః కథం = దీనినతిక్రమించుట యెట్లు ? అతః = ఇందువలన, కర్మణః = కర్మయొక్క, త్యాగః = పరిత్యాగము, మతః = అంగీకరింపబడినది.

కర్మ నిత్యమనియు, నైమిత్తికమనియు, కామ్యమనియు, నిషిద్ధమనియు ఇట్లు నానావిధము గా చెప్పబడినది. ఇందు ఒక్కొక్క దానికి ఒక్కొక్క ఫలము వేఱు వేఱుగా శాస్త్రముచే చెప్పబడియే యున్నది. కావున కర్మకు ఫలము ముక్తియని ఎక్కడ గూడ చెప్పబడియుండలేదు. చెప్పుటకు వీలులేదు. ఈ చెప్పిన ఒక్కొక్క కర్మచే ముక్తి కలుగకున్నను ఈ యన్నింటిచేత ముక్తి కలుగవచ్చును గదా ? యనిన ఈ కర్మలు వేఱు వేఱు అధికారులను బట్టి చెప్పబడియున్నందున (ఇవి) ఒక్కనియందు ఉండుట అసలే సంభవింపదు. ఈ చెప్పిన ప్రతియొక్క కర్మయు ముక్తిని గలిగించును అనినచో ఈ పక్షము గూడ యోగ్యముగ లేదు. ఏలన, ప్రతికర్మ మోక్షమును కలిగించుచో ప్రతివాడు మోక్షమును

పొందవలసి యుండును. అపుడు జ్ఞానము నిరర్థక మగును. ఈ చెప్పిన ప్రతి కర్మ నిష్కామముగా చేసినచో ముక్తి కలుగును అనినచో అదియు ఘటిల్లదు. ఏలన, నిషిద్ధకర్మ నిష్కామ మెట్లగును ? ఇయ్యది పాపకర్మగదా? ఈ నిషిద్ధ (పాప) కర్మను అట్లుండనీయుము అనినచో ఈ పాపమునకు పరిహార మెట్లు ? నిష్కామకర్మచే పాపము పరిహృతమగును అనినచో, మంచిదే. అపుడు దీనిచే పాపపరిహార మనెడి పలమే కలిగి నట్లగును గాని మోక్షమనెడి ఫలమెట్లు కలుగును? కావున ఏ విధముగా విచారించినను కర్మ మోక్షసాధనము కానందున అధికారయైన వానికి దీని త్యాగమే విధింపబడినది. (నిష్కామ కర్మచేత ముక్తి అన్నప్పుడు అయ్యది ముక్తికి సాక్షాత్ సాధనము కాదనియు, పరంపరాసాధనము మాత్రమగుననియు దానికి అర్థముగా గ్రహింపవలెను. ఎట్లన, కృష్ణానది సముద్రమును నేరుగా పోయి చేరును. మలప్రభ, ఘటప్రభ, – ఈ నదులు కృష్ణానదితో కూడుకొని సముద్రమును చేరును. ఇట్లు కర్మ క్రమేణ జ్ఞాన సాధనమై ముక్తికి పరంపరా సాధనమగును. జ్ఞానమో సాక్షాత్ సాధన మగును. ఇట్లు కర్మకు క్రమసముచ్చయమును చెప్పవలసినదే కాని సమసముచ్చయమును గాని, సాక్షాత్ సాధనత్వమును గాని చెప్పరాదు).

వేదాన్తభేరికి ఈ క్రిందివారు పోషక చందా పంపినారు

01.	డి. దామోదరరావు (వరంగల్లు)	–	రూ. 1200/–
02.	ప్రశాన్తి (బెంగుళూరు)	–	రూ. 2000/–
03.	గాజుల రాజయ్య (శాయనపేట)	–	రూ. 1500/–
04.	ఎం. వెంకటేశ్వర గుప్త (మచిలీపట్నం)	–	రూ. 1500/–
05.	నాగుల యాదగిరి (వేములవాడ)	–	రూ. 1500/–

క్రథాత్మక గీతా సూక్తులు

– ఆచార్య కె. సర్వోత్తమరావు, తిరుపతి

(ఏప్రిల్ సంచిక తరువాయి)

సమలోష్టాశ్మ కాంచనః

ఈ గీతావాక్యం భగవద్గీత ఆత్మసంయమయోగ నామకమనే ఆరవ అధ్యాయం ఎనిమిదవ శ్లోకం చివరి భాగం. సమలోష్ట అశ్మ కాంచనః అని విభాగం. ఈ లోకమంతా పరిశీలిస్తే అన్ని వస్తువులను సమానంగా చూడు. మట్టి, రాయి,బంగారం ఈ మూడింటిని సమానంగా పరిగణించు. అపుడే హాయిని పొందగలవనే సారాంశం.

మానవుని జీవితంలో రాగం, అనురాగం సహజం. పరిణతమనస్కులలో వైరాగ్యం సహజం. వారిలో సుఖభోగాదుల కాంక్ష కాసంతవున్నా తరువాత దశలో వైరాగ్యం వికసిస్తుంది. సమదృష్టి వైరాగ్యానికి చివరి మెట్టు. ఈ భావానికి అనుసంధానంగా రామకృష్ణ పరమహంస గూఢార్థకథను అనుసంధానం చేసుకోవడం సబబు.

ఒక ఊరిలో ఆలుమగల జంటలున్నారు. వారికి క్రమంగా లౌకిక జగత్తుపై అసహ్యం పుట్టింది. మమకారాలు, మమతానుబంధాలు హీనంగా హేయంగా అనిపించాయి. వారిరువురు విరక్తులయ్యారు. ఆపై తీర్థయాత్రలకని కదిలారు. నగరం పొలిమేరదాటి వస్తున్నారు. భార్య ఏదో మంత్రం జపిస్తూ, ముందుకు వెళ్ళే భర్తను అనుగమిస్తూ నడుస్తున్నది. ఈ నడకలో దూరం హెచ్చింది. నడుస్తుంటే మగవాని కళ్ళకు ఏదో జిగేలుమని వస్తువు కనబడింది. మగవాడు మెల్లగా వంగి ఆ వస్తువును చేతిలో తీసుకొన్నాడు.

అది శ్రేష్ఠమయినరత్నం. అటు ఇటూ చూశాడు. ఎవరూ దగ్గరలేరు. భార్య వెనక వస్తూ వుంది. మగవాడు ఆలోచించాడు. ''ఆడవారికి నగలు నగ్రా ఇష్టం కదా. ఈ వజ్రం చూస్తే కావాలంటుందేమో. మరి ఇల్లు వదలి వైరాగ్యంతో కదలిపోతున్నప్పుడు వజ్రదర్శనం అరిష్టం కదా ! అంచేత ఆవిడ రావడానికి ముందే పాతేయాలని ఒక గుంత తవ్వడం మొదలు పెట్టాడు. ఈలోగా భార్య రానే వచ్చింది. గుంత పక్కనున్న వజ్రం చూసింది. తవ్వుతున్న గుంతను చూసింది. భర్త ఎందుకు తవ్వుతున్నాడో అర్థమయింది. వెంటనే మీకు భేదభావం ఇంకా పోలేదు. మట్టికీ మాణిక్యానికి ఇంకా తేడా కనిపిస్తూ వుంది అని అంది. భర్త వజ్రం పారేశాడు. భార్యతో నడక సాగించాడు. అసలు వైరాగ్యం అర్థమయింది.

హరిదాసులలో 'పురందరదాసు' ఒకడు. కర్ణాటక సంగీతపితామహుడు. హంపీ నగరరాజవీధులలో తంబూరా మీటుతూ పాడుతూ వెళ్ళేవాడు. అతని వీపున జోలె వుండేది. ఎవరయినా ఏమయినా వేయవచ్చు. ఇదొక భక్త్యాత్మక ఉంఛవృత్తి. రాయలొకసారి దాసులవారిని చూచారు.

పాటకు ముగ్ధులయ్యారు. అయినా ఆ దాసుల వీపు మీది జోలె చూచి బాధపడ్డారు. రాయలవారికి మెరుపులాంటి ఆలోచన తట్టింది. తుంగభద్రాతీరంలోని వ్యాసరాయలవారిని దర్శించారు. అంతేకాదు వ్యాసరాయల వారితో 'స్వామీ ! నాదొక విన్నపం. మీ శిష్యులు పురందర దాసులవారు నగరవీధులలో జోలెపట్టి పాడుతూ వెళ్ళడం నాకు చాలా బాధగా వుంది. ఆ మహానుభావులకు అవసరమయినవన్నీ మా దేవిడీ నుండి రోజూ పంపిస్తాము. ఈ ఉంఛవృత్తి మాన్పించండి' అని ప్రార్థించాడు.

వ్యాసరాయలవారు నవ్వుతూ అలాగ ! పురందరదాసు నా శిష్యుడే. కాని నా మాట వింటాడనే నమ్మకం లేదు. నీవే పరీక్షించుకో – అన్నారు. రాయలవారు లాభం లేదనుకొని మనసులో ఏదో ఆలోచించుకొని మరుసటి రోజు సామాన్యుని వేషంలో 'దోసెడు ముత్యాలు' జోలెలో జారవిడిచారు.

దాసులవారు పాడుతూ వెళుతున్నారు. దాసులవారు ఇంటికి వెళ్లాక ముత్యాలు ఏరి దాచుకొని మరుసటిరోజు నుండి ఉంఛవృత్తి మానేస్తారని భావించారు రాయలు. కాని అదేం జరగలేదు. మరుసటిరోజు యథాప్రకారం 'హరిదాసు' తిరుగుతున్నారు. రాయలు మరల దోసెడు ముత్యాలు వేశారు. కాని లాభం లేకపోయింది. ఈవిధంగా వారం గడించింది. రాయలవారికి అనుమానం కలిగింది.

మరుసటిరోజు ముత్యాలు జోలెలో పడవేసి ఆ హరిదాసుల వెంబడి నడిచారు. దాసులవారి ఇల్లు చేరుకొన్నారు. భార్య సరస్వతి జోలె తీసింది. నేలమీద వేసింది. ఆ జోలెలోని అన్ని వస్తువులు వేరు చేసింది. ముత్యాలేరింది.రాయలు చూస్తునే ఉన్నారు. సరస్వతి ముత్యాలను హారంగా కూర్చింది. ఆపై లేచి తులసమ్మ కోటకు సమర్పించింది.

రాయలు దిగ్భ్రాంతులయ్యారు. తానెన్ని రోజులు ముత్యాలు పడవేశారో అన్ని హారాలు తులసీ కోటకున్నాయి. ఇక లాభం లేదనుకొని వ్యాసరాయల వారి దగ్గరికి వెళ్ళి తాను చూచినదంతా సవిస్తరంగా చెప్పారు.

వ్యాసరాయలవారు 'కృష్ణరాయ!', నేను అప్పుడే చెప్పాను కదా ! నవకోటి నారాయణుడు పురందరదాసు. అంతా దానం చేసి హరిదాసు అయ్యాడు. నీ ముత్యాలకు ఆశపడతాడా' అన్నారు. దాసులంటే పురందర దాసులే, అని ఎలుగెత్తి చాటారు రాయలవారు.

జ్ఞాన విజ్ఞాన తృప్తాత్మా కూటస్థో విజితేన్ద్రియః
యుక్త ఇత్యుచ్యతే యోగీ సమలోష్టాశ్మ కాంచనః



పుష్పదంత విరచిత
శివమహిమ్న స్తోత్రమ్

శ్రీ మధుసూదనీటీక - తదనువాదం

- అనువాదకులు శ్రీ బ్రహ్మవిద్యానందగిరి స్వాములవారు

(మే తరువాయి)

హరిపక్షము :

మ.టీ.: అన్యచ్చ గంధర్వరాజస్య మహాకుశలత్వా దేకేనైవ శ్లోకేన యథాశ్రుతి వక్రరీత్యాచ హరిశంకరయోః స్తుతి స్తయోరభేదజ్ఞానాయ అభిప్రేతా తత్ర హరపక్షే యథాశ్రుతి వ్యాఖ్యాతమ్ । హరిపక్షే2పి తదేవయోజనీయమ్.

అను : మరియు గంధర్వరాజగు పుష్పదంతుడు మహాకుశలుడు, గాన ఒకే శ్లోకముచే యథాశ్రుతము మరియు వక్రరీతిచే శివకేశవుల (ఉభయ) పక్షమున స్తుతించుట వారిరువురికి అభేదమును బోధించుటయందే తాత్పర్యము గలదు. శివపక్షములో శ్లోకమునకు యథాశ్రుతము వ్యాఖ్యానము చేయబడినది. (యథాశ్రుతము = ఎట్లు వినబడినదో, అట్లు మహిమ్నస్తోత్రము, శివస్తోత్రముగా ప్రసిద్ధి). హరిపక్షములో గూడ సామాన్యముగా శ్లోకాభిప్రాయమును అట్లే తెలిసికొనవలెను. విశేషార్థము చెప్పబడుచున్నది.

మ.టీ.: సంబోధనపదం తు అహరేతి । హరతీతి హరః సంహర్తా తద్విరుద్ధో2హరః । పాలయితేత్యర్థః, అథవా2హః అహోపరమ పరా మా లక్ష్మీర్యస్యేతి తథా హే లక్ష్మీపతే !,లక్ష్మీపతిత్వాన్మమాలక్ష్మీం స్వత ఏవ నాశయిష్యసేతి యోగ్యం సంబోధనమ్ । యది తే మహిమ్నః= త్వన్మహిమసంబంధినీ = త్వన్మహిమ విషయా స్తుతిః । గిరోమహిమ్న ఇతి యోజనాపేక్షయా తే స్తుతిరిత్యేవ సమీచీనమ్। తత్తర్హి అవసన్నా2ల్పా అసదృశ్యననురూపాప్యస్తు, నత్వన్య దేవతానామనల్పా2నురూపాపి । అత్ర హేతుగర్భం విశేషణమ్ । తవ కీదృశస్య । బ్రహ్మాదీనాం స్తావకానాం గిరః స్తుతి రూపా యా పారం విదుషః స్తోతుః శ్రమం స్తుతేర్గుణదోషౌచ జానత ఇత్యర్థః । సర్వ దేవస్తుత్యత్వేన నిరతిశయ సార్వజ్ఞ్యేన చ తవైవ సర్వోత్కృష్టత్వాదిత్యభిప్రాయః । స్తుతిఫలం దర్శయన్ స్వస్య వినయాతిశయం దర్శయితుమాహ। అథ స్వం త్వాం అతి పరిణామావధి అతిక్రాంతో బుద్ధిపరిపాకావధిః సీమా యత్ర తాదృశం యథాస్యాత్తథా స్వశక్తి మతిక్రమ్యాపి గృణన్ స్తువన్ సర్వో2పిజనః అవాచ్య ఆభిముఖ్యేన వాచ్యః । సంభాషణీయస్త్వయేత్యర్థః, యస్మాదేవం సర్వద్దైవానుగృహ్యతే త్వయా స్తోతా అత ఏవ మమాపిస్తోత్రే స్తుతికర్తృ ఏష పరికరో నమస్కారాది ప్రబంధః । కీదృశః । అనిరపవాదః న విద్యతే2తిశయేనాపవాదో దూషణం యస్మాత్ స తథా । అహరితి వీప్సనీయమ్ అహరహః సర్వదేత్యర్థః । యద్విషయకస్తుతి కర్తృకత్వేన అన్యో2పి సర్వదా నమస్యఃకిము వక్తవ్యం స సర్వదా సర్వేషాం నమస్యతరో భవతీతి భగవతి రత్యతిశయో వ్యజ్యతే, ఏవం యస్యాయోగ్యాపి స్తుతిః సాన్నిధ్యఫలా తస్య యోగ్యాస్తుతిః కింవా న ఫలిష్యతీతి ధ్వనితమ్ । హరపక్షే2ప్యేవమ్ । తత్ర పరమశ్రేష్ఠేతి సంబోధనమ్ । 1 ।

అను : హరపక్షమునందు 'అహర' అనునది సంబోధన పదము. ఎవరు సర్వమును హరించునో అనగా సంహరించునో అతడు హరుడు. అతనికి విరుద్ధ (భిన్న) మగువాడు అహరుడు (పాలకుడు) హే పాలక! (అనిసంబోధనము). లేక అహః=అహో, సంబోధన సూచక అవ్యయము, అహోపరమ ! పరా= అన్నిటికంటే ఉత్తమమైనది. 'మా' లక్ష్మి ఎవరికి గలదో. అతడు పరమ (విష్ణువు) అనబడుతాడు. " నీవు లక్షీపతివి గనుక స్వయముగానే నా యొక్క అలక్ష్మిని (దారిద్ర్యమును) నాశనము చేసెదవు" అనునభిప్రాయములో సంబోధనము సముచితముగానున్నది. నీయొక్క మహిమను కొద్దిగా (అల్పముగా) కీర్తించినా మరియు

అననురూపము (అయోగ్యము) అయినాగూడ, అది శ్రేష్ఠమే యగును. కాని అన్యదేవతల స్తుతి అధికముగాను, అనురూపముగాను కీర్తించినా గూడ తుచ్ఛమేయగును. ఎందుకనగా ! బ్రహ్మాది స్తుతికర్తల స్తుతిరూప వాణి యొక్క అంతమును నీవెఱుగుదువు. అనగా స్తోత్రయొక్క శ్రమను మరియు స్తుతి యొక్క గుణదోషములను చక్కగా గుర్తించెదవు. సమస్త దేవతలచే స్తుతింపబడుటకు యోగ్యుడవు (స్తుత్యుడవు), మరియు నిరతిశయ సర్వజ్ఞత్వమువలన,అందరికంటె ఉత్కృష్టుడవు. స్తుతిఫలమును తెలుపుతూ, స్వవినయాతిశయమును ప్రకటిస్తూ గంధర్వరాజు అంటున్నాడు. ఎవరెవరు స్వబుద్ధిశక్తినతిక్రమించి గూడ ఆత్మీయముగా (ఆత్మ సంబంధియైన) నిన్ను స్తుతింతురో, వారితో నీవు ప్రేమాతిశయముచే సంభాషణముజేసెదవు. నీయనుగ్రహమునకు పాత్రులగుదురు.

శ్లో ॥ ప్రియో హి జ్ఞానినో2త్యర్థమహం సచ మమ ప్రియః ।
ఉదారాస్సర్వ ఏవైతే జ్ఞానీత్వాత్మైవ మే మతమ్ ॥ (గీతావచనము)

ఎప్పుడు నీయొక్క స్తుతికర్తను (ఆత్మీయభక్తున్ని) నీవు సర్వథా సమ్యగ్ రీతిచే అనుగ్రహించెదవో, అలాంటప్పుడు దీనుడనై నిన్ను స్తుతించు ఈ నానమస్కారాది పరికరః = ప్రబంధః = ప్రయత్నము గూడ (అహర్ శబ్దమును రెండుసార్లు పఠించినచో అహరహః") సర్వదా అపవాద శూన్యమేయగును. ఎవరియొక్క స్తుతిచేయుటవలన సాధారణ పురుషుడు గూడ నమస్కార యోగ్యుడగుచున్నాడో, అట్టి యెడ సాక్షాత్ ఆ పరమాత్మ అత్యంత స్తుత్యుడు (వందనీయుడు) అని వేరుగ చెప్పవలెనా? ఇట్లు భగవంతునియందు నిరతిశయ భక్తివ్యంగ్యము (వ్యఞ్జనా వృత్తి)చే తెలియబడుచున్నది. ఈ విధముగా పరమాత్మ యొక్క అయోగ్యస్తుతి గూడ అతని సాన్నిధ్యమునకు గొని పోవుచున్నదనిన, ఇక యోగ్యమగుస్తుతి యే ఫలమునివ్వదు ? అని

ధ్వనితమగుచున్నది. శివ పక్షమునందుగూడ ఇట్లే అర్థము జేయవలెను. హరపక్షమున 'పరమ" అను పదము "హే శ్రేష్ఠుడా !" అను సంబోధనముగా గ్రహించనగును.

వివరణము : "స్తుతి" అనగా గుణకథనము (కీర్తనము). పరమాత్మ స్వరూపముచే నిర్గుణ, నిష్క్రియ, నిరాకారుడు, " సాక్షీ చేతా కేవలో నిర్గుణశ్చ " (శ్వే.ఉ) మరియు సగుణ విగ్రహ దృష్టితో చూచినచో అతడు అనంతగుణ సంపన్నుడు. నిర్గుణమును స్తుతించే ప్రశ్నయే లేదు. సగుణ స్వరూపమును గూడ స్తుతించలేము. అనంత గుణములు గలవాడిని నాలుగైదు గుణములతో కీర్తించినచో అదిస్తుతి ఎలా అనబడుతుంది? అందువలన భగవంతుని స్తుతించుటలో ప్రస్తకమగు దోష సంభావనను పరిహారము చేయుటకు స్తుతి చేయవచ్చును ఎట్లు?

శ్రీ పుష్పదంతాచార్యులంటున్నారు. హే శివ! నిన్ను స్తుతించుటకు శక్యముగాదు. ఎందుకనగా ! జీవులిరుతెఱంగులు. ఒకరు అస్మదాది (మా లాంటి) అల్పజ్ఞులు. మరొకరు బ్రహ్మాది సర్వజ్ఞ జీవులు (సవై శరీరి ప్రథమః). ఎవరు అల్పజ్ఞులో, వారిచే చేయబడు స్తుతి అయోగ్యము. ఎందుకనగా అల్పజ్ఞత్వము వలన ఈ విషయములో గొప్ప ఆశ్చర్యమేమియు లేదు. కాని మహదాశ్చర్యమేమనగా ! సర్వజ్ఞులైనవారి వాణిగూడ నిన్ను స్తుతించుటలో కుంఠితమగుచున్నది. వస్తుతః పరమాత్మ యొక్క సంపూర్ణ గుణములను (విభూతులను) వర్ణించుట కెవరితరము గాదు. " నమే విదుః సురగణాః ప్రభవం న మహర్షయః''గీత) అందువలన సర్వజ్ఞులుగూడ నిన్ను యథాయోగ్యముగా స్తుతించలేరు. ఎప్పుడైతే బ్రహ్మాది సర్వజ్ఞులు గూడ నిన్ను స్తుతించలేరో, ఇక మా బోటివారి సంగతేమిటి ? (గజాపి పలాయన్తే మశకానాం కిం వక్తవ్యమ్) అట్లైనచో ఎవరు గూడ (అల్పజ్ఞులు మరియు సర్వజ్ఞులు) నిన్ను స్తుతించుటకు సమర్థులు కారు అను

ప్రశ్నకు సమాధానముగా అందరు పరమాత్మను కీర్తించుటకు అధికారులే (యోగ్యులే) అని చెప్పుచున్నారు.

ఏ పక్షియైనను ఆకాశములో ఎంతగా ఎగిరినను, ఆకాశము యొక్క అంతును (అవధిని) మాత్రము చేరలేదు. దేని సామర్థ్యము ఎంతగలదో, అంతమాత్రము ఎగురగలుగుతుంది. ఇందులో దోషమేమియు లేదు. ఆకాశముయొక్క సీమను గరుత్మంతుడు గూడ దాటలేడు మరియు సామాన్య పిచ్చుక గూడ దాటలేదు. (ఆకాశ పతిత్రి న్యాయము). అట్లే అల్పజ్ఞులు గాని, సర్వజ్ఞులుగాని నీ గుణములను (మహిమను) సంపూర్ణముగా తెలియజాలరు. అయినాగూడ వారి వారి బుద్ధి విభవానుసారము అనేక స్తోత్రములద్వారా అనన్యభక్తితో నిన్ను స్తుతిస్తూ ఉంటారు. ఇది దోషముగా పరిగణించబడదు. (దోషము గాదు, భూషణమే), ఎప్పుడు వారందరు చేయు స్తుతి అనురూపమో (యోగ్యమో) మరియు వారును వందనీయులో- అలాంటప్పుడు నేను గూడ దీనుడనై అనన్యభావముతో నిన్ను స్తుతించుటకు జేయు ఉపక్రమము (నమస్కారాది అల్ప ప్రయాస) నిర్దోషమే యగును. అనగా నిన్ను కీర్తించుటకు నేను గూడ అధికారినే (యోగ్యుడనే) కావున నిన్ను స్తుతించుచున్నాను.

అయితే ఈ శ్లోకములో పుష్పదంతుడు భగవంతుని స్తుతించినదేమున్నది ? అను శంక కలుగుచున్నది. సమాధానము " నీ గుణములు ఇటువంటివి, నీవు ఇంతటి వాడవు అని నిన్ను సంపూర్ణముగా ఎవరునూ తెలియలేరు మరియు స్తుతించ సమర్థులు గారు " అని చెప్పుటయే స్తుతియగును. చిన్న పిల్లవాని తొత్తరమాటలు విన్న తల్లిదండ్రులకు ఎట్లు ఆనందము గలుగునో, అట్లే ఎవరు, వారి బుద్ధిశక్త్యనుసారము నిన్ను స్తుతింతురో, వారి స్తుతి (స్తోత్రము)చే నీకు గూడ ఆనందము తప్పకుండా కలుగుతుంది. వారు నీ యనుగ్రహమునకు పాత్రులగుదురు.

అష్టాశయముల నాశ్రయింపుము

- స్వామి సర్వేశ్వరానందగిరి
- ఆంధ్రాశ్రమం, హృషీకేశ్

ప్రియమైన ఆధ్యాత్మిక సోదరా !

భువి నుండి దివివర కేలోకముల కేగినను నీవెవ్వరివో నీ స్వస్వరూప మెఱుగనంతవరకు తిరిగి మరలమరల నీవీభువి కేతెంచవలసియే యున్నదన్న విషయము నెన్నడును విస్మరించకుము. మట్టిపై మానవజన్మ నెత్తిన నీకితర జీవరాసులకు లేని ఉత్తమోత్తమ సౌకర్యమేమన ఒక్క కర్మాధికారమే ననుటలో నెట్టి అతిశయమును లేదనవచ్చును. ఏలననగా నెనుబది నాలుగు లక్షల జీవరాసులలో నొక్క మానవునకు మాత్రమే యీ కర్మాధికారము పరమేశ్వరునిచే ప్రసాదింపబడిన పరమ పవిత్రమైన వరమనిపించుచున్నది. ఇతర జీవరాసులేగాక, చివరకు ముక్కోటి దేవతలకు సైతము నిట్టి కర్మాధికారవరము లేదనియు, వారెల్లరును కేవలము పురాకృత పుణ్యపాపముల యొక్క ఫలబోగములను మాత్ర మనుభవించువారనియు శాస్త్రము లుద్ఘోషించుచున్నవి.

ఇట్టి ఉత్తమమైన మానవజన్మ లభించినందులకు దాని విలువను గుర్తించి వివేకాది సాధన చతుష్టయ సంపన్నుడవై అమృత స్వరూపమైన ఆత్మజ్ఞానమును బడయుము. ఫేన బుద్బుదాదులనదగుమాయ, తత్కార్యములు లేని అద్వితీయాత్మానంద సాగరుడవై విరాజిల్లుము. దీనికంటె యధికమగు ఫలమిచ్చుటనేగాదు మరెచ్చటను, యే యితర ఊర్ధ్వ అధోలోకములలో సైతము లేదని యెఱుంగుము.

ఇట్టి సదవకాశమును చేజేతుల జారవిడచుకొని అద్వితీయ

ఆత్మజ్ఞానమును బొందక మాయామోహితుడవై దేహేంద్రియాదుల యందహంకార మమకారములను బొంది ఇంద్రియాదుల ద్వారా విషయభోగముల ననుభవించుచు అమూల్యమైన కాలమును వ్యర్థబుచ్చినచో జీవిత పర్యంత మనేక దుఃఖముల నిచ్చట ననుభవించుటేగాక శరీరపతనానంతరము సంచిత పాపకర్మల ఫలితముగ క్రిమికీటక పశుపక్ష్యాది జన్మల నెత్తుచు, మరణించుచు మహా దుఃఖము పాలుగావలసి యుండునని గ్రహించి వెంటనే మేల్కొనుము.

ఆధ్యాత్మిక జీవనమున నడుగిడు సాధకునకు అత్యంతావశ్యకమైన (1) శ్రద్ధ (2). నిష్కపటము (3). నిరాడంబరత (4). సహనము (5).సత్యసంధత (6). వ్యర్థ సంభాషణలను తగ్గించుకొనుట (7) సాధు మహాత్ములను సేవించుట (8). సర్వేశ్వరుని యెడల అకుంఠిత విశ్వాసము ననెడి అష్టాశయముల నాదర పూర్వకముగ నాచరించుటకై యత్నించవలసియున్నది. ప్రాణములను సైతము లెక్కించక దృఢమైన పట్టుదలతో వీటి నాచరించుచో తప్పక ఆశయ సిద్ధియైన అమృతత్త్వమును బడయగలవు.

పై వచించిన అష్టాశయములలో మొదటిదియైన శ్రద్ధయనగా, మనస్సులో నుద్భవించు ఆవేదనాభినివేశముల హెచ్చరిక యని గ్రహించుము. ఈ మానసిక హెచ్చరిక గాఢముగను, దృఢముగను నుండినచో ఆధ్యాత్మిక సాధనలో నిష్ఠ చక్కగ కుదురు అవకాశము గలదు. నిష్ఠ నిలకడగా నుండిననే సిద్ధి లభించగలదు. నీ జ్ఞాన ప్రవృత్తి ఉత్సాహపూర్వకమై బుద్ధి శుద్ధమైనచో నీలో తప్పక సద్గురువు నెడలను, సచ్ఛాస్త్రమునందును అకుంఠిత శ్రద్ధ గలిగి మానసిక ఏకాగ్రత, సాధనయందు దృఢనిష్ఠ నలవడును. కేవలమొక్క మోక్షేచ్ఛమాత్రమే గలిగియుండి, దానిని బడయుటకు ఆరని జ్యోతివలె పరిమితమైన శ్రద్ధ నీలో రగుల్కొనినచో యీ ప్రథమాశయమును నీవు చక్కగాపాలించిన

వాడవయ్యెదవు.

రెండవ ఆశయమైన నిష్కపటమనగా, మనోవాక్కాయములలో నెవ్వరియందును కపటత్వము లేక, అందరియందును సుహృద్భావముతో మెలంగుచు బుద్ధిపూర్వకముగ పరోపకారుడవై ప్రకాశింపుము. తాను దగ్ధమగుచు గూడ కర్పూరమెటుల వెలుగును వెదజల్లునో, తాను కాలి నుసియైపోవుచున్నను చందన మెటుల సుగంధమును వ్యాపింపజేయునో, అటులనే కపటరహితముగ నీజీవితమును యితరుల మేలుకొఱకై త్యాగమొనరించుము. త్యాగపరుడు సర్వేశ్వరుని ప్రియభక్తుడని గ్రహించి నిష్కపటబుద్ధితో నిష్కామముగ త్యాగమయజీవితమును గడుపుటను అభ్యసింపుము.

మూడవ ఆశయమైన నిరాడంబరతను నివాసములోను, ఆహార విహారములలోను, వస్త్రధారణలోను, వాక్సమ్యమమునందును, ఆచరణలోను అభ్యసింపుము. వాగాడంబరము అధోగతి నొందించు ప్రమాదము గలదు గాన అనుభవము లేని ఆధ్యాత్మిక విషయములను యితరుల మెప్పులకై ఆడంబరముగ వచించుట మానివేయుము. హీనమై, మలమూత్రముల కొంపయై రక్తమాంసాస్థిమయమగు శరీరమనెడి పెను వ్రణమును నాచ్ఛాదించుటకై శుచిగను, శుభ్రముగను నుండు సాధారణ నూలు వస్త్రములను ధరించుము. విలువైన పట్టుపుట్టములను ధరించి, నలుగురిలో నధికధనవంతుడననిపించుకొనుటకై ఆడంబరమునకు పోయి అప్పులపాలై మానసిక శాంతిని మంటగలుపుకొని చేజేతుల జీవితమును దుఃఖమయ మొనరించుకొనకుము.

ఆశయములలో నాల్గవదైన "సహనము" యిచ్ఛాభయక్రోధము లెచ్చట తలయెత్తవో, అచ్చట అపరిమితమైన తేజస్సుతో ప్రకాశించగలదు.

తే.గీ. : పొడిచిన కొట్టిన తిట్టిన చెడుగై
ఎవడెంత యెగ్గు చేసిన బ్రీతిన్

బడియెదగా కెపుడు బాల్పడను
బదులు చేయ క్రోధభయములు లేమిన్ ”

అని యొక మహాత్ముడు సహనము యొక్క అవధిని అనుభవైకముగ వివరించెను. గాన నట్టి సహనపరుడవై యుండుటకు అనవరతము యత్నించుము. ఇట్లొనరించుటచే దేహమునకును ఆత్మకును గల భిన్నత్వము చక్కగ గోచరించు దేహాత్మబుద్ధి అచిరకాలముననే నశించగలదు.

ఐదవదియైన సత్యసంధత యనగా నెట్టి పరిస్థితులయందైనను సత్యమునే పలుకుచు దాని నంటిపెట్టుకొని యుండుట యనవచ్చును. జీవిత సర్వస్వమును సత్యనిష్ఠ కనుకూలముగ మలచుకొనుచు ఎట్టి క్లిష్ట పరిస్థితులెదురైనను త్రికరణ శుద్ధిగ నీవు సత్యమని విశ్వసించిన విషయమును ఆచరించుటకై యత్నించుము. తామీ మార్గమున పయనించుచున్నందున కడగండ్ల పాలగుచుంటిమనెడి భావనను సైతము మానసమున గలుగనీయక, సత్యపథమున పయనించువారికి అనిర్వచనీయమైన శాంత్యానందములు లభించగల వనుటలో నెవ్విధమైన అతిశయోక్తియును లేదన వచ్చును.

వ్యర్థ సంభాషణలు, వ్యావహారిక విషయముల గూర్చి చర్చించుట తగ్గించుకొనుటచే కాలము యొక్క అమూల్యతను గుర్తించిన వాడవై ఆరవ ఆశయమును నమలు జరిపినవాడవయ్యెదవు. ఆధ్యాత్మికముగ నెంత ఉన్నత దశకు చేరుకున్నటుల నీవు భావించినను ఆడంబరముతో అధిక ప్రసంగము లొనరించుచున్నదో నయ్యవి నీ ఉన్నత పథమున కాటంకమును గలిగించి శీఘ్ర కాలముననే నిన్నపవిత్రునిగ నొనరించగల ప్రమాద మున్నదని గ్రహించుము. మాట్లాడవలసిన అవశ్యకత గలిగి, తప్పనిసరి యైనపుడు ఆత్మాభ్యుదయమున కడ్డుపడక తోడ్పడునట్టి మాటలనే మిక్కిలి మితముగ మాట్లాడు టెంతయో మంచిది.

సాధు సత్పురుషులను, శ్రోత్రియ బ్రహ్మనిష్ఠులైన సద్గురువులను

వినయవిధేయతలతో సేవించుట ద్వారా సప్తమాశయమును సాధించినవాడ వయ్యెదవు. మలయమారుతము వీచుచుండ విసనకర్ర యొక్క ఆవశ్యకత యెటుల గలుగదో, నటులనే సాధు పురుషుల సాంగత్య భాగ్యము లభించుచో సకల సాధనములును సమకూరగలవని గుర్తించుము. ఉత్తమాశయములతో విరాజిల్లు సాధు పుంగవుల ఉజ్జ్వల జీవిత దృష్టాంతముల వైపునకు నీ దృష్టిని మరలించు టెంతయో శ్రేయోదాయకము. సాధు మహాత్ములను త్రికరణ శుద్ధిగా సేవించుటచే సత్య సంధత సమకూడి బుద్ధిమాంద్యత నశించగలదు. సంఘములో గౌరవ ప్రతిష్ఠల చేగూర్చి, హృదయ విశాలతా ప్రసన్నతలను ప్రసాదించునట్టి సాధు సాంగత్య సేవాభాగ్యముల నెన్నడును విడనాడకుము.

అష్టాశయములలో నాఖరుదైన దైవము నెడల నకుంఠితవిశ్వాసము నీకు తెలియకుండగనేనిన్ను నీ మనస్సును, నీ బుద్ధిని, నీ స్వభావమును, నీ ధర్మకర్మలను, అంతేగాక నీ సర్వ భవితవ్యమును సక్రమముగ నడుపుట ద్వారా నీలో జ్ఞాననేత్రమును వికసింపజేసి దృఢాపరోక్షానుభూతిని ప్రసాదించునంతటి దివ్యశక్తి సామర్థ్యములు గలదని యెఱుంగుము.

పైన వివరింపబడిన అష్టాశయముల నవరతమాశ్రయించి, శక్తివంచన లేక, ప్రాణాపాయ స్థితి యందైనను పట్టుదలతో పాలించుచో నిత్యమై, నిర్వికారమై, అసంగమై, అద్వితీయమై, పరిపూర్ణమై, సచ్చిదానందమై, స్వప్రకాశమై, చిదేకరసమై యొప్పు పరమాత్మానుభవసిద్ధి నీ కచిరకాలముననే గలిగి శాశ్వత శాంత్యానందములతో విరాజిల్ల గలవు.

సర్వేశ్వరు డీ అష్టాశయములు నిరంతరము నీకు గలిగి యుండునట్లనుగ్రహించుగాక !

గృహవైద్యం

సమపాళ్లుగా ఎండుద్రాక్ష, అడ్డ సరపు ఆకు, పిప్పళ్లు, పంచదార కలగలిపి కషాయం కాచి రోజుకు రెండుసార్లు త్రాగితే దగ్గు, ఆయాసం శమిస్తాయి.

శ్రీ మదాంధ్ర మహా భాగవతము

– ఆచార్య జక్కంపూడి మునిరత్నం (తిరుపతి)

(గత సంచిక తరువాయి)

ఉత్తరాధికారి ఉద్భవం : కొన్నాళ్ళు గడిచాయి. ఉత్తమ గ్రహాలన్నీ ఉచ్ఛస్థితిలో ఉన్న శుభముహూర్తంలో అభిమన్యుడి అర్ధాంగి ఉత్తరకు కౌరవసామ్రాజ్య ఉత్తరాధికారి ఉద్భవించాడు. ధర్మరాజు చాలా సంతోషించాడు. తమ పురోహితుడైన ధౌమ్యుడితోపాటు మరికొందరు బ్రాహ్మణులను రప్పించాడు. పుణ్యాహవాచనం నిర్వహింపజేశాడు. బిడ్డకు [illegible] బ్రాహ్మణులకు షడ్రసోపేతంగా భోజనాలు

ఎవరి కెఱుక ?

[illegible]గా అనేక దానాలు చేశాడు. విష్ణువు చేత [illegible] విష్ణురాతుడనే పేరుతో విరాజిల్లి విశ్వవిఖ్యాతుడౌతాడని విప్రులు చెప్పారు. ధర్మరాజు ఆనందించాడు.

– ఆచార్య కె. పురుషోత్తమరావు (తిరుపతి)

'ఓ బ్రాహ్మణులారా ! మీకు నమస్కరిస్తాను. నా మాట ఆలకించండి. మా పెద్దవాళ్ళు ఎంతో దయగలవారు గొప్ప కీర్తితో జీవించారు. ఈ బిడ్డ కూడా వారి అడుగుజాడల్లోనే నడుస్తాడా ? మాధవుడి మీద సడలని భక్తితో జీవితం సాగిస్తాడా ? ఒకసారి చూసి చెప్పండి.' అని ధర్మరాజు బ్రాహ్మణులను ప్రాధేయపడ్డాడు.

' ఈ బాలుడు సాటిలేని మేటి చక్రవర్తి కాగలడు. ఉత్తమ గుణ సంపన్నుడౌతాడు. విష్ణు భక్తి పరాయణుడౌతాడు. ధర్మబద్ధంగా రాజ్యపాలన సాగించి మునికుమారుడి శాపానికి గురౌతాడు. తక్షకుడి విషాగ్నితో తాను మరణిస్తాడని తెలుసుకొని అన్నిటినీ పరిత్యజిస్తాడు. గోవిందచరణారవిందాలను భజిస్తూ శుకయోగీంద్రుడి వల్ల బ్రహ్మజ్ఞానం పొంది భయశోకాలు లేని పుణ్యలోకాలకు వెళతాడు – అని బిడ్డ

భవిష్యత్తును గురించి విప్రులు విడమరచి చెప్పారు. ధర్మరాజు ఇచ్చిన కానుకలను స్వీకరించి ఆ బ్రాహ్మణులు వెళ్ళిపోయారు.

తల్లి గర్భంలో ఉన్నప్పుడు తనను రక్షించిన ఆ మహానుభావుడు ఈ ప్రపంచంలో ఎక్కడైనా ఉన్నాడేమో అని పుట్టినబిడ్డ పరీక్షగా చూడసాగాడు. పరీక్షగా చూస్తుండడం వల్ల ఆ బిడ్డను 'పరీక్షిత్తు' అని పిలిచారు. తాతల ముద్దు మురిపాలు తీరుస్తూ ఆ పిల్లవాడు క్రమంగా పెరగసాగాడు.

జన్మకాలాన్ని బట్టి పరీక్షిత్తు జన్మ మిక్కిలి విశిష్టమైందని బోధపడుతుంది. బిడ్డ పుట్టినప్పుడు పుణ్యాహవాచనం చెయ్యడం, జాతక ఫలాలు చెప్పించుకోవడం ద్వాపరయుగంలోనూ ఉండేవని తెలుస్తుంది. ధర్మరాజు బ్రాహ్మణులనడిగిన ప్రశ్నను బట్టి మంచి లక్షణాలు గల ముందుతరం వారి కనుగుణంగానే సంతానం ఉండాలనీ, ఉండేట్టు చూసుకోవాలని గ్రహించవచ్చు.

యాగనిర్వహణ : దిక్పాలకుల వంటి నలుగురు తమ్ముళ్ళ తోడ్పాటుతో ధర్మరాజు మహావైభవంగా రాజ్యపాలన సాగించాడు. కులదీపకుడైన మనుమణ్ణి అల్లారుముద్దుగా పెంచి పెద్ద చేశాడు. యుద్ధంలో చుట్టాలను చంపిన పాపం ధర్మరాజు మనస్సును బాధించడం మానలేదు. ఆయన దాన్ని పోగొట్టుకోవాలనుకున్నాడు. పాపపరిహారార్థం అశ్వమేధ యాగం చెయ్యాలని సంకల్పించాడు. తన దగ్గరున్న ధనం సరిపోదేమోనని సంశయించాడు. పూర్వం మరుత్తమహారాజు యజ్ఞం చేసి మిగిలిన ధనాన్ని భూమిలో పూడ్చి పెట్టినట్టు విన్నాడు. ఈ సంగతిని తన తమ్ముళ్ళకు తెలియజేశాడు. భీమార్జునులు ఉత్తరాభిముఖులై వెళ్ళారు. అక్కడ నుంచి బంగారు రాశులను తీసుకువచ్చారు.

ధర్మరాజు యాగానికి కావలసిన సరంజామాన్నంతా సంసిద్ధం చేసుకున్నాడు. శ్రీకృష్ణణ్ణి బంధువులతో కలిసి రమ్మని యజ్ఞానికి ఆహ్వానించాడు. పురుషోత్తముడైన శ్రీ కృష్ణుడినే యజ్ఞపురుషుడిగా పూజించాడు. మూడు అశ్వమేధ యాగాలను నిర్విఘ్నంగా నిర్వహించాడు. కృష్ణుడు హస్తినాపురంలో కొన్నాళ్ళుండి అర్జునుణ్ణి కూడా వెంటబెట్టుకొని బంధుసమేతంగా ద్వారకకు వెళ్ళిపోయాడు.

పశ్చాత్తాపం, పాపభీతి, పాపాన్ని పోగొట్టుకోవాలనే ఆరాటం, మహనీయులను ఆశ్రయించడం మంచివారి లక్షణాలని ధర్మరాజు నడవడిని బట్టి గ్రహించవచ్చు.

విదురుడి రాక : తీర్థయాత్రకు వెళ్ళిన విదురుడు మైత్రేయ మహర్షిని కలుసుకున్నాడు. ఆయననడిగి అనేక విషయాలను తెలుసుకున్నాడు. హస్తినకు తిరిగి వచ్చాడు. ధృతరాష్ట్రాదులకు ఎంతో సంతోషం కలిగింది. ఎదురువెళ్ళి స్వాగతం పలికారు. ధర్మరాజు కూడా విదురుణ్ణి శ్రద్ధాభక్తులతో సేవించాడు. సపర్యలతో సంతోషింపజేశాడు. భోజనం తర్వాత తీరుబడిగా కూర్చున్న విదురుడి దగ్గరకు వెళ్ళాడు. తీర్థయాత్రా విశేషాలను తెలియజేయగోరాడు.

' మీ వంటి మహనీయులు తీర్థాలను లెక్కచేయరు. మీలోనే విష్ణువు ప్రకాశిస్తూ ఉన్నాడు. అందువల్ల మీరూ తీర్థప్రాయులే. ఆలోచిస్తే మీకంటే పుణ్యతీర్థాల్లేవు. మీవంటి మహనీయులను దర్శించి మాట్లాడడమే అదృష్టం. వేరే తీర్థాలను వెదకవలసిన అవసరం లేదు. మా తండ్రి మరణించిన తర్వాత పెద్ద తండ్రి కొడుకులు పెట్టిన కష్టాల నుంచి కరుణతో మమ్మల్ని కాపాడిన మహానుభావులు మీరు. ఎప్పుడైనా ఆ విషయాలను మీరు గుర్తు చేసుకుంటారా ? తీర్థయాత్రా సమయంలో ద్వారకకు వెళ్ళారా ? మాధవుని అనుగ్రహం వల్ల యాదవులంతా

క్షేమంగానే ఉన్నారా ? మీరు వెళ్ళకపోయినా ఎవరి ద్వారానైనా వాళ్ళ సంగతి మీకు తెలిసిందా ? ' ధర్మరాజు ప్రశ్నకు సమాధానంగా విదురుడు తన తీర్థయాత్రా విశేషాలను వివరంగా తెలియజేశాడు. కాని ధర్మరాజు బాధపడతాడని యాదవ వినాశం చెప్పకుండా దాటవేశాడు.

విదురుడు ధర్మస్వరూపుడు. పూర్వం మాండవ్య మహర్షి శాపం వల్ల యమధర్మరాజు శూద్ర స్త్రీకి జన్మించాడు. అతడే విదురుడు. యమధర్మరాజు విదురుడుగా భూలోకంలో ఉన్నప్పుడు అతని తండ్రి సూర్యుడు యముడి బాధ్యతను నెరవేర్చాడు. పాపులను దండించాడు.

తీర్థయాత్రలకు వెళ్ళడంలోని ముఖ్యోద్దేశం ఆయా ప్రదేశాలను దర్శించడమేగాక అక్కడి మహాత్ములను సందర్శించి వారి నుంచి అవసరమైన జ్ఞానాన్ని కూడా పొందడం. యముడంతటివాడు కూడా కర్మఫలాన్ని తప్పించుకోలేక పోయినప్పుడు సామాన్యులకు అది సాధ్యపడుతుందా ! ఈ దృష్టితో కర్మలు చేసేటప్పుడు హెచ్చరికగా ఉండాలి.

తృతీయ జ్ఞాన సదస్సు

శ్రీ శుకబ్రహ్మాశ్రమ 3వ జ్ఞాన సదస్సు ఆగష్టు 3వ తేది ప్రారంభమై నడుస్తుంది. బ్రహ్మశ్రీ ఓ.ఎస్.రామలాల్ శర్మ గారు ఆచార్యులుగా కేనోపనిషత్తుపై పాఠం చెపుతారు.

4వ జ్ఞాన సదస్సు

శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరుగు 4వ జ్ఞానసదస్సు సెప్టెంబర్ నెల 1 తేది నుండి భాద్రపదశుద్ధ ఏకాదశి నాడు ప్రారంభమై సెప్టెంబరు 6వ తేది పౌర్ణమి వరకు 5 రోజులు జరుగును. ఆచార్యులుగా పూజ్యశ్రీ సత్యాత్మానంద సరస్వతి స్వాములవారు (చిన్మయ మిషన్, ఒంగోలు) కఠోపనిషత్తుపై పాఠం చెప్పుతారు.

హిందూ దేవాలయ పుట్టు పూర్వోత్తరాలు

- ఆచార్య ఎస్.శ్రీపతినాయుడు

(రచయిత శ్రీనాయుడుగారు మనదపల్లి బి.టి.కాలేజీలో లెక్చరర్‌గా పని చేశారు.)

హిందూ మతానికి ప్రతిబింబం దేవాలయం. క్రైస్తవ మతస్థులకు చర్చివలె, మహమ్మదీయులకు మసీదువలె ఇది పవిత్ర దైవ ప్రార్ధనాలయం. మానవుడు భగవంతుని వదలి జీవించలేడు. భగవంతుడు కన్పించకపోతే అతన్ని వెతకాలి అని వోల్టేర్ పండితుడు శెలవిచ్చినాడు. భగవన్నామస్మరణ కోసం భక్తులందరూ ఒక స్థలంలో గుమిగూడటం పరిపాటి. మౌనంగా ధ్యానం చేసుకోడానికి, కోర్కెలను భగవంతునికి నివేదించడానికి భగవంతుడు నివసించే ప్రదేశానికి దేవాలయమని పేరు. తమిళంలో కోవిల్ అంటారు. కో అని పలికే భగవంతుని ఇల్లు అని అర్ధం.

దేవాలయ పుట్టు పుర్వోత్తరాలను తెలుసుకోటానికి అనువైన చారిత్రక ఆధారాలు లేవు. మానవునికి, భగవంతునికి మధ్య వారిధి లాంటిది దేవాలయం. దేవుడు నివసించే ప్రదేశాన్ని దేవాలయమంటారు. భోగాలతో, అలంకారాలతో భగవంతుడు నివసించే ప్రదేశాన్ని ప్రాసాదమని కూడ వ్యవహరిస్తారు. ఈ దృష్టిలో ఆలోచిస్తే ధ్వజస్థంభం, రాజపతాకంగాను, ప్రాకారం కోటగోడగాను,గోపురం ప్రవేశ ద్వారంగాను కన్పిస్తాయి. గర్భగృహానికి, కొన్ని సందర్భాలలో దేవాలయానికి విమానం అనే పదం వాడుతారు. సక్రమంగా నిర్మితమైన కట్టడమని అర్ధం. భగవంతుని సృష్టి ఈ ప్రపంచం అని చెప్పడానికి విమానం అనే పదం వాడబడింది. వాయుమానం అని చెప్పుకొంటే, భక్తులను పరవశింప చేయడానికి భగవంతుడు వాయుమానంగా ఉపయోగించాడు అని చెప్పాలి. భక్తులు గుమిగూడే స్థలాన్ని తీర్ధం

అంటారు. దేవాలయానికి తీర్ధానికి దగ్గర సంబంధం ఉంది. సంసార సాగరాన్ని దాటడానికి తీర్ధం మార్గంగా ఉపయోగపడుతుంది. దేవాలయంభగవంతుని స్వరూపానికి ప్రతీక. గర్భగృహం దేవుని శిరస్సు కాగా, గోపురం పాదాలు, సుఖనాశి ముక్కుగాను, అంతరాళం మెడగాను, మంటపాలు చేతులుగాను, ప్రాకారం శరీరంగాను వర్ణిస్తారు. భగవంతుని సృష్టికి చెందిన వివిధ లోకాలను కూడా దేవాలయంలో చూడవచ్చు. భగవంతుని పాదాలు భూలోకంగా భావించవచ్చు. ఆలయాల ఇతర భాగాలు వేర్వేరు లోకాలను సూచిస్తాయి.

అధిష్ఠానం	-	భువర్లోకం
స్థంభాలు	-	స్వర్లోకం
ప్రస్తర	-	మహర్లోకం
శిఖర	-	జనలోకం
ఆమలసార	-	తపోలోకం
స్థూపిక	-	సత్య లోకం

స్థూల దృష్టిలో దేవాలయాన్ని భగవంతునితో పోలిస్తే, సూక్ష్మదృష్టితో ఇదే ఆలయాన్ని మానవ శరీరానికి పోల్చవచ్చు. దేవాలయ వివిధ బాగాలు మానవ శరీర భాగాలను పోలి వున్నాయి. పాదుక, పాద, చరణ, అంఘ్రి, జంఘ, ఊరు, గళ, గ్రీవ, కంఠ, శీర్ష, కర్ణ, నాసిక, శిఖ మొదలైనవి మానవ శరీరానికి పోల్చవచ్చు. దేవాలయ వివిధ భాగాలు మానవ శరీర అంగాల పేర్లు. గర్భగృహాన్ని హృదయంగా భావిస్తే సర్వంతర్యామి గోచరిస్తాడు. శరీరంలోని సప్త చక్రాలకు కూడా ఈ భాగాలను పోల్చవచ్చు.

గర్భగృహ	-	అనాహత చక్రం
కలశ	-	సహస్రార చక్రం
మహామంటపం	-	మూలాధార చక్రం
ముఖమంటపం	-	స్వాధిష్ఠాన చక్రం
అంతరాళం	-	మణిపూర చక్రం

గ్రీవ - విశుద్ధ చక్రం
శిఖర - ఆజ్ఞా చక్రం

1922లో సింధు ప్రాంతంలో జరిగిన త్రవ్వకాలలో అద్భుత నాగరికతా అవశేషాలు బయల్పడినాయి. సింధు ప్రజలు శైవమతాన్ని ఆదరించినారని లభ్యమైన ఆధారాలను బట్టి చెప్పవచ్చు. పశుపతి బొమ్మగల ముద్రిక, శక్తి. బలిని సూచించే ముద్రిక. గుండ్రని రాళ్ళు (లింగాలు), సర్ప, వృక్ష పూజలు నాటి శైవమత ప్రాశస్త్యానికి నిదర్శనాలు. కాని సింధు ప్రజలు సామూహిక ప్రార్ధనలకోసం ఆలయాన్ని నిర్మించినట్లు చెప్పడానికి ఆధారాలు లభ్యం కాలేదు. వేదమంత్రాలలో దేవతా మూర్తుల ప్రస్తావన ఉంది. హిందూ దేవుళ్లను, దేవతలను ఐదు వర్గాలుగా విభజించవచ్చు.

స్థానిక - నిలబడి ఉన్న - శ్రీ వేంకటేశ్వర స్వామి
ఆసీన - కూర్చొని ఉన్న - గణపతి
శయన - పరుండిన - శ్రీ గోవిందరాజస్వామి
యానక - వాహన సహిత - గరుడ, నంది
దేవీ సహిత - దేవితో కూడిన - కుమార స్వామి

ఆర్యుల కాలంలో దైవ ప్రతిమలను 'శాల' అనే ప్రదేశంలో పూజనిమిత్తం ఉంచేవారు. ఇదే ఆలయ నిర్మాణ ప్రారంభం. యాగశాల కాలక్రమేణా దేవాలయంగా మారిందన్న అభియోగం లేకపోలేదు. ఇతిహాస కాలం నాటికి దైవశాలను ధృఢ నిర్మాణంగా మార్చే ప్రయత్నం జరిగింది. తొలుత నిర్మింపబడిన ఆలయాలు కొయ్యతోను, మట్టితోను నిర్మించబడినాయి. తరువాత కొండ గుహల్లో ఆలయాలను నిర్మించే ప్రయత్నం జరిగింది. ఆలయ నిర్మాణ వివరాలు ప్రాచీన గ్రంథాలలో లభ్యమౌతున్నాయి.

దేవాలయ నిర్మాణం పవిత్ర యజ్ఞం. రాజులు, ధనికులు తమ సంపదను ఈ ఆలయ నిర్మాణానికి ఖర్చుపెట్టినారు. మత ధర్మశాస్త్ర ప్రకారం ఆలయ నిర్మాణం అనేక దశల్లో జరిగేది. ఆలయ నిర్మాణ కర్తను యజమాని అని పిలుస్తారు. ఇతడు నిర్మాణం కొరకు పవిత్ర స్థలాన్ని నిర్ణయించాలి. స్థాపకుడు లేదా ఆచార్యుడు నిర్మాణ పర్యవేక్షకునిగా సద్బ్రాహ్మణుడే నియమింపబడుతాడు. స్థాపకునిగా ఎన్నుకోబడుతాడు. ఆచార్యుడు స్థపతిని నిర్ణయిస్తాడు. స్థపతికి సహాయకారులుగా సూత్రగ్రాహిన్, తక్షక, వర్ధకిన్‌లు వ్యవహరిస్తారు. యాజమాన ఆచార్యులవారు సంకల్పసిద్ధితో ఆలయ నిర్మాణం ప్రారంభించాలి. నిర్ణయించిన స్థలంలో పెరిగిన గడ్డిలాంటి అక్కర్లేని మొక్కలు తొలగించి పరిశుభ్రం చేయాలి. దుష్ట శక్తుల నుండి ఆ స్థలం దూరం చేయబడాలి. సుమూహుర్తంలో వాస్తు విన్యాసం జరపాలి. అంటే వాస్తు మండల విధానాన్ని నిర్ణయించాలి. వాస్తు పురుషునకు పూజలు చేసి, పని నిర్విఘ్నంగా జరిగిపోవాలని ప్రార్థించి కార్యక్రమం ప్రారంభించాలి. పని ప్రారంభదశను అంకురార్పణ అంటారు. ఇటుకపనిని మూర్దేష్టక అంటారు. పదహారు రాగిపాత్రల్లో వివిధ ధాన్యాలను నింపి సోమబలిగా పాతిపెడ్తారు. ఊతితో పునాదిని నిర్మించే పనిని శిలాన్యాస మంటారు. పునాది అన్ని వైపులా నిర్మించి, గర్భగృహం మధ్యలో ఖాళీస్థలం వదుల్తారు. అర్ధారశీల అనే ఈ భాగంలో తాబేలును, నిధికుంభమనే కుండను, పద్మాన్ని (అన్ని ఊతితో చేసినవే). బంగారుతో చేయబడిన తాబేలు, పద్మాన్ని ఉంచుతారు. రాగితో చేయబడిన యోగనాళాన్ని పునాది ఎత్తు వరకు నిలుపుతారు. దానిమీద కప్పిపెట్టే రాయిని బ్రహ్మశిల అంటారు. గర్భన్యాస పద్ధతిలో రాగితో చేయబడిన సమచతురస్ర పాత్రలో అనేక విలువైన వస్తువులను ఉంచి, భూమిలో పాతిపెడ్తారు. ఆలయ నిర్మాణానికి ఉపయోగించే అన్ని వస్తువులు కొత్తవి గాన, పూజ తరువాతనే వాటిని ఉపయోగించడం జరుగుతుంది. ఆలయ నిర్మాణం పూర్తి అయిన పిమ్మట శాస్త్రోక్తంగా మూలబేర విగ్రహాన్ని పరివార దేవతా విగ్రహాలను ప్రతిష్ఠిస్తారు. తరువాత ఆలయ హంగులు - నంది

మంటపం, యాగశాల, హోమశాల – చేకూర్చబడుతాయి.

ఆలయంలోని ముఖ్యభాగం గర్భగృహం. ఇది సాధారణంగా సమచతురస్రంగా నిర్మింపబడే గది. గణితశాస్త్రరీత్యా ఈ గది మధ్య భాగంలో మూలవిరాట్టును ప్రతిష్ఠిస్తారు. ముందు తలుపు తప్ప గాలి వెలుతురు రావడానికి మరేమార్గం ఉండదు. గర్భగృహం చుట్టు ప్రదక్షిణాపథ ముంటుంది. వేసరపద్ధతికి చెందిన ఆలయాలలో ఇది ఉండదు. గర్భ గృహానికి ముఖ మంటపానికి మధ్యన ఉన్న యిరుకుమార్గాన్ని అర్ధమంటపమని, సుఖనాశి అని, అంతరాళమని వ్యవహరిస్తారు. నైవేద్యాన్ని, ఉత్సవమూర్తులను ఈ అంతరాళంలో ఉంచుతారు. ముఖమంటపంలో ఉత్సవాలకు ఊరేగింపులకు అవసరమయ్యే వాహనాలు తదితర సరంజామా ఉంటుంది. మహామంటపంలో భజనలు, నాట్యప్రదర్శన, హరికథలు, ధర్మప్రసంగాలు మొదలైనవి జరుగుతాయి. మహామంటపానికి దగ్గర్లో ధ్వజస్థంభం ఉంటుంది. రాగితో చేయబడిన రాజలాంఛనం ఈ స్థంభానికి అతికించబడుతుంది. సాధారణంగా ఈ లాంఛనం మూలబేర వాహనమై ఉంటుంది. శివాలయాల్లో నంది, దేవి మందిరంలో పార్వతి, వైష్ణవాలయంలో గరుడ మొదలైనవి. ధ్వజస్థంభానికి ప్రక్కనే బలిపీఠం ఉంటుంది. పేరునుబట్టి దీని ఉపయోగాన్ని ఊహించవచ్చు. ఈ బలిపీఠం ఱాతితో చేయబడి, పద్మాకారంలో గాని, దేవుని పాదాలు కాని చెక్కబడి ఉంటాయి. జైనుల ఆలయాల్లో ధ్వజస్థంభానికి బదులు యూపస్థంభం లేదా మానస్థంభం ఉంటుంది. మొత్తం ఆలయాన్ని పరిరక్షించడానికి ప్రాకారగోడ నిర్మించబడుతుంది. ప్రవేశద్వారంపై గోపురం కట్టబడుతుంది. ప్రాకారం లోపల పరివార దేవతామందిరాలు నిర్మించబడుతాయి. శివాలయంలో పార్వతి, సుబ్రమణ్య, చండీశ్వర, గణపతి, దక్షిణామూర్తులకు ప్రత్యేక మందిరాలుంటాయి. ఇవికాక కల్యాణ మండపం, యాగశాల, పాకశాల మొదలైనవి. ఇతర హంగులు, దీపస్థంభాన్ని నిర్మించడం కూడ కద్దు. **(సద్గురువాణి పత్రిక నుండి)**

వార్తలు

(01). జూలై 4వ తేది మంగళవారము తొలి ఏకాదశినాడు శ్రీ సద్గురు మహర్షి మలయాళ స్వాములవారి ఆరాధన శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో జరిగినది. శ్రీ సద్గురు స్వాములవారి శ్వేత శిలా విగ్రహానికి షోడశోపచార పూజ చేయబడినది.

(02). జూలై 4వ తేది కృష్ణాజిల్లా చాట్రాయి మండలం, చీపురుగూడెం గ్రామంలో శ్రీ మలయాళస్వామి గీతా ప్రచార సమితి వారిచే శ్రీమతి దుద్దుకూరు అనసూయమ్మ గారి ఆధ్వర్యంలో శ్రీకృష్ణానందబ్రహ్మచారి పౌరోహిత్యంలో జరిగిన శ్రీ సద్గురు మలయాళస్వాముల వారి ఆరాధనోత్సవాలలో శ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని ప్రవచనము చేశారు. డా॥ సముద్రాల లక్ష్మణయ్య గారు (తిరుపతి), శ్రీ నారాయణానందస్వాములవారు (అసిఫాబాదు) పాల్గొని ప్రవచనలు చేశారు.

(03). జూలై 4 వతేది సోమవారం ఉదయం 9.30 గం॥ల నుండి 10.30 గం॥లవరకు శ్రీకాళహస్తి కర్నాలవీధిలోని శ్రీ షిరిడిసాయి బాబామందిర ద్వాదశవర్ష మహాకుంభాభిషేకంలో పూజ్యశ్రీ విద్యాస్వరూపానందగిరి స్వాములవారు పాల్గొని మందిరంలోని మూర్తులకు, మందిర మూలశిఖరానికి కుంభాభిషేకము చేశారు.

(04). జూన్ 14వ తేదీ నాడు శ్రీ శుకబ్రహ్మాశ్రమ సద్గురు సర్వ సేవా ట్రస్టు వారిచే 15 మంది బీద విద్యార్థులకు 2,19,100 (రెండు లక్షల 19 వేల ఒక వంద రూపాయలు ఉన్నత పాఠశాలల, కళాశాలల ఫీజులు ఇవ్వబడినవి.

(05). శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో ద్వితీయ జ్ఞానసదస్సు 4-07-2017 తేది ఏకాదశినాడు ప్రారంభింపబడి 8వ తేది సాయంకాలానికి సమాప్తమైంది. ఆచార్యులుగా పూజ్యశ్రీ మాతా పరావిద్యానందగిరిస్వామినివారు పాల్గొని ఈశావాస్యోపనిషత్తుపై రోజూ ఉదయం, సాయంకాలములందు ప్రవచన చేశారు. సదస్యులు ఆచార్యులైన మాతాజీ ఉపనిషత్తుపై చెప్పిన సవివరణాత్మక ప్రవచనకు చాలా ఆనందించినారు.

(6). 9-07-2017 తేదీ ఆదివారంనాడు గురుపౌర్ణమి సందర్భంగా శ్రీ శుకబ్రహ్మాశ్రమంలో గురుదేవులు పూజ్యశ్రీ విద్యాప్రకాశానందగిరి స్వాములవారి పాదుకలకు అభిషేకం అర్చన జరిగినది. భక్తులకు అన్నదానం చేయబడినది.

(7). 11-07-2017 తేది నెల్లూరుజిల్లా కోవూరు మండలం ఇనమడుగు గ్రామం శ్రీ సత్యానందాశ్రమంలో జరిగిన బ్రహ్మీభూత ఆశ్రమ పీఠాధిపతులు పూజ్య శ్రీ బ్రహ్మానంద తీర్థస్వాములవారి షోడశీపూజలో పూజ్య శ్రీ స్వాములవారు పాల్గొనినారు.

(08). ఆశ్రమ కంటి ఆసుపత్రిలో జూన్ నెలలో ఓ.పి.లో **1085** మందికి కంటి పరీక్షలు, చికిత్సలు చేయబడినవి. **115** మందికి కంటి పొరలు తీసి కళ్లలో లెన్సు అమర్చబడినవి. **11 గురికి** మందికి లేజర్ చికిత్సలు చేయబడినవి.